# పోతిరెడ్డిపాడుపై కెసిఆర్ ఎందుకు స్పందించరు

## కేసులు ఎందుకు వేశామో తెలియదా

### ఇరిగేషన్ కార్యదర్శికి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

హైదరాబాద్,మే15(ఆర్ఎన్ఎ): పోతిరెడ్డిపాడుపై సిఎం కెసిర్ ఎందుకు మౌనంగా ఉంటున్నారో, ఎందుకు ఎపికి సహకరిస్తున్నారో చెప్పాలని, టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ప్రాజెక్టులపై కేసులు వేసిన ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి టీఆర్ఎస్‌లోనే ఉన్నారని, ఎందుకు వేశాడో అతన్నే అడగండి చెబుతాడని చెప్పారు. ప్రజల భూములు బలవంతంగా లాక్కుంటుంటే వారికి అండగా నిలబడ్డామని చెప్పారు. ప్రజల పక్షాన కోర్టుకు వెళ్తే తప్పేలా అవుతుందని ప్రశ్నించారు. ప్రజల ప్రయోజనాల్ని కాపాడకుండా తమపై విమర్శలు చేయడానికి సిగ్గుండాలన్నారు. సీఎంలు కేసీఆర్, జగన్‌తో మాట్లాడి పోతిరెడ్డిపాడు పనులు ఆపిస్తే అభినందిస్తామని తెలిపారు. పనులు ప్రారంభమైతే కేసీఆర్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోతిరెడ్డిపాడుపై ప్రధాని, కేంద్ర జలవనరుల మంత్రికి ఫిర్యాదు చేస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావును కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. మే 5న జగన్ ప్రభుత్వం జీవో తెస్తే ..మే 11న కేసీఆర్ సమీక్ష చేశారని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ ఈ జీవోల గురించి ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ 55వేల క్యూసెక్కులు తీసుకెళ్తుంటే కేసీఆర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పోతిరెడ్డి కాంట్రాక్టు పనులు కేసీఆర్ చెప్పిన వారికే వస్తాయని, ఏపీ జలదోపిడీపై ప్రధాని, జలవనరుల మంత్రికి లేఖలు రాస్తామని రేవంత్ ప్రకటించారు. ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శిని కాంగ్రెస్ నేతలు కలిశారు. రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పరిగి రామ్మోహన్ రెడ్డి, ప్రసాద్ కుమార్‌లు కలిసిన వారిలో ఉన్నారు. ఏపీ ప్రభుత్వం 203 జీవోపై తెలంగాణ ప్రభుత్వం తక్షణం స్పందించాలని రేవంత్ డిమాండ్ చేశారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచుకునేందుకు జగన్‌కు కేసీఆర్ గిఫ్ట్‌గా ఇచ్చారని దుయ్యబట్టారు. కేసీఆర్ అనుమతితోనే జగన్ జీవో 203 తెచ్చారని, కాంగ్రెస్ ఆందోళన తర్వాతే కేసీఆర్ మేల్కొని సమీక్ష చేశారని రేవంత్‌రెడ్డి చెప్పారు.

తెలంగాణ ఉద్యమ సమయలో సీఎం కేసీఆర్ రైతులను కొండెక్కించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ వచ్చి ఆరేళ్ళు అవుతున్నా.. రైతుల మోహాలలో సంతోషం లేదని అన్నారు. ఎన్నికల ముందు రైతుబంధు పేరుమీద ఓట్లు దండుకొని టీఆరెస్ రాజకీయాలు చేస్తోందని అన్నారు. టీఆరెస్ ప్రభుత్వంలో రైతులకు పంటనష్టం జరిగిందని, రైతులకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేదని అన్నారు. కేసీఆర్ రైతా..? లేక రాజకీయ నాయకుడా? సమాధానం చెప్పాలన్నారు. ఎకరానికి ఐదు వేలు ఇస్తా అన్న కేసీఆర్.. ఇప్పటికి వరకు రైతులకు పూర్తిగా రైతుబంధు రావడం లేదన్నారు. గతేడాది రైతు బంధు 60శాతం రాలేదని, ఈ ఏడాది అసలు వస్తుందా? రాదా? అనేది కూడా ఎవ్వరికి తెలియదని జగ్గారెడ్డి అన్నారు. తాజాగా ప్రభుత్వం చెప్పిన పంటే వేయాలనే కేసీఆర్ నిబంధన పెడుతున్నడంటే.. రైతు బంధు వదిలించుకునే ప్రయత్నమే జరుగుతున్నట్టు అనిపిస్తోందన్నారు. రైతు బంధులానే రేపు తాను చెప్పిన పిల్లనో ,పిలగాన్నో చేసుకోకపోతే కళ్యాణ లక్ష్మీ కూడా ఇవ్వనంటాడోమో నని జగ్గారెడ్డి అన్నారు. . తెలంగాణ వస్తే పెరుగన్నం తినొచ్చన్నారు..హాయిగా ఉండొచ్చొన్నారని, పంట నష్టపోతే కనీసం పరిహారం కూడా రావడం లేదని ధ్వజమెత్తారు. ఎన్నికలు ఉంటేనే కేసీఆర్‌కు రైతు బంధు గుర్తొస్తుందన్నారు. తను చూపించిన అబ్బాయిని పెళ్లి చేసుకుంటేనే.. కల్యాణ లక్ష్మి ఇస్తానని కేసీఆర్ అంటారేమోనని ఎద్దేవాచేశారు. మంత్రి హరీష్‌రావు ఉమ్మడి జిల్లా మెదక్‌కు చేసిందేమీ లేదన్నారు. సంగారెడ్డిలో హరీష్‌రావు మీటింగ్ పెడితే హాజరై రైతుబంధుపై నిలదీస్తానని జగ్గారెడ్డి హెచ్చరించారు.

# భద్రాద్రి నిత్యాన్నదానానికి భారీ విరాళం

### 38లక్షలు అందచేసిన ప్రవాస భారతీయులు

భద్రాద్రి,మే15(ఆర్ఎన్ఎ): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నిత్యాన్నదాన పథకానికి ప్రవాసభారతీయులు ఐకా రవి, రూప, పూజ రూ.38 లక్షల విరాళాన్ని అందజేశారు. అమెరికాలోని సౌత్‌బోర్గ్‌కు చెందిన ఐకా రవి తన తండ్రి దివంగత ఐకా దాలయ్య జ్ఞాపకార్థం ఈ విరాళాన్నిఅందజేసినట్లు తెలిపారు. రూ.38 లక్షల విరాళం దేవస్థానం అధికారులకు అందడంతో ఐకా రవి ప్రతినిధి భద్రాచలానికి చెందిన వేగేశ్న శ్రీనివాసరాజుకు ఇందుకు సంబంధించిన అన్నదానం బాండ్‌ను దేవస్థానం ఇవో జి.నర్సింహులు గురువారం అందజేశారు. భద్రాద్రి దేవస్థానం చరిత్రలో ఇంత భారీ మొత్తం అన్నదానానికి ఒక భక్తుడు అందజేయడం ఇదే ప్రథమం. గతంలో ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన చేకూరి వీర వెంకటరావు రూ.8.50 లక్షలు అందజేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత నిత్యాన్నదాన పథకం ప్రారంభసమయంలో రాజాబొమ్మదేవర విజయరాఘవదేవి రూ.6 లక్షలు విరాళంగా అందజేశారు. అయితే భద్రాద్రి దేవస్థానం ఉచిత నిత్యాన్నదాన పథకానికి ఇప్పటివరకు రూ.27 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు వివిధ బ్యాంకుల్లో దేవస్థానం పేరిట ఉన్నాయి.

# ధర్మసాగర్ చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలి



నిర్మల్,మే 15 : ధర్మసాగర్ చెరువు సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముషర్రఫ్ ఫారూఖీ నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని ధర్మసాగర్ చెరువును అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ధర్మసాగర్ చెరువు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. చెరువులోని నీటిని మొత్తం విడుదల చేసి అందులో ఉన్న గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాలన్నారు. చెరువు చుట్టూ పరిసరాల పరిశుభ్రత తో పాటు పచ్చదనంపెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ముందర పచ్చదనం, అభివృద్ధి పనులకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి వెంటనే పనులను ప్రారంభించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

# చర్లపల్లి విస్తరణతో సిటీపై భారం తగ్గుతుది

### పనులను పరిశీలించిన మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్,మే15(ఆర్ఎన్ఎ): చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు అనుసంధానం చేస్తూ అభివృద్ధి చేస్తున్న రోడ్లను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, నగర మేయర్ బొంతు రామ్మోహన్, ఫిర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చర్లపల్లి రైల్వేస్టేషన్‌ను జంక్షన్‌గా అభివృద్ధి చేయడంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకునే మార్గాలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. చెంగిచర్ల చౌరస్తా నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా పెద్ద చర్లపల్లివరకు 100 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే ఐవోసీ పెట్రోల్ బంక్ నుంచి భరత్‌నగర్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు రోడ్డు విస్తరణ చేస్తున్నట్లు వివరించారు. వీటితో పాటు ఎన్.ఎఫ్.సి చౌరస్తా నుంచి చెంగిచర్ల చౌరస్తా మెయిన్‌రోడ్ దారిలో భారత్ గ్యాస్ కంపెనీ పక్క నుంచి ప్రతిపాదిత రైల్వే టెర్మినల్ వరకు నూతనంగా 120 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదిత భూములను పరిశీలించారు. ఈ నూతన రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమిని సేకచేందుకు అటవీ, టి.ఎస్.ఐ.ఐ.టీ.సీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి ప్రతిపాదనలకు తుదిరూపు ఇవ్వనున్నట్లు తెలిపారు.

### పోలీసులకు లొంగిన న్యూడెమక్రసీ సభ్యులు

వరంగల్,మే15(ఆర్ఎన్ఎ): పోలీసుల అదుపులో ఉన్న సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ అజ్ఞాత దళ నాయకులు సోమ భాస్కర్ అలియాస్ సూర్యం, ప్రతాప్ అలియాస్ శ్యామ్ లొంగిపోయినట్లు పోలీసులు ప్రకటించారు. మూడు రోజుల క్రితం వరంగల్ రూరల్ జిల్లా పరిధిలో ఈ ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే విషయాన్ని మీడియా వెల్లడించినా తమ అదుపులో ఎవరూ లేరని పోలీసులు చెప్పారు. అయితే సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ నేతలు తెలంగాణ వ్యాప్తంగా ఆందోళనలకు దిగారు. పట్టుబడ్డ దళ నాయకులను కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఎక్కువ కావడంతో నాటకీయ పరిణామాలమధ్య గురువారం ఆ ఇద్దరు లొంగిపోయినట్లు వరంగల్ సీపీ రవీందర్ తెలిపారు.

# రైతుబంధుపై అపోహాలు వద్దు.. నిరంతరం కొనసాగుతుంది



మహబూబ్‌నగర్, మే 15: రైతుబంధుపై అపోహాలు వద్దు.. నిరంతరం కొనసాగుతుంది అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలో వ్యవసాయ శాఖ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే సమగ్ర వ్యవసాయ విధానాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరిస్తారని స్పష్టం చేశారు. ఏ పొలంలో ఏ పంట వేస్తే రైతులకు లాభం అనేదానిపై కసరత్తు జరుగుతుందని తెలిపారు. రైతుబంధు నిరంతరం కొనసాగుతుంది.. అపోహాలు వద్దు అని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది రాష్ట్రంలోని రైతులందరికీ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీకి కృషి చేస్తామన్నారు. పాలమూరు - రంగారెడ్డి పథకం త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రాజెక్టు పనుల వేగవంతానికి త్వరలో ఇంజినీరింగ్, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని మంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పాలమూరు - రంగారెడ్డి పథకానికి నష్టం జరగనివ్వబోము అని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో రాజకీయాలకతీతంగా పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

## మే1 నుంచి 800 శ్రామిక్ రైళ్లు

# పదిలక్షల మందిని గమ్యస్థానం చేర్చాయి

### -ట్వీట్ చేసిన మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ,మే15(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి నిరోధం కోసం అమలవుతున్న దేశవ్యాప్త అష్ట దిగ్బంధనం సమయంలో మే 1 నుంచి 10 లక్షల మంది ప్రయాణికులను భారతీయ రైల్వేలు తమ గమ్యస్థానాలకు చేర్చినట్లు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. మే 1 నుంచి 800 శ్రామిక్ రైళ్లు వలస కూలీలను తమ గమ్య స్థానాలకు చేర్చినట్లు తెలిపారు. ఒక్కొక్క రైలులో 1,200 మంది ప్రయాణికులు ప్రయాణించి నట్లు తెలిపారు. మొత్తం మీద సుమారు 10 లక్షల మంది వలస కూలీలను వారి స్వస్థలాలకు చేర్చినట్లు చెప్పారు. దేశవ్యాప్త అష్ట దిగ్బంధనం సమయంలో నగరాల్లో వలస కూలీలు తమ జీవనోపాధిని కోల్పోయా రన్నారు. దీంతో వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి తమ స్వస్థలాలకు వెళ్ళినట్లు ట్వీట్‌లో పేర్కొన్నారు.

మరొక ట్వీట్‌లో, గోయల్ రైల్వే సిబ్బందిని ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం నెలకొన్న సమయంలో రైల్వే సిబ్బంది ప్రజల సేవ కోసం అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. ఇదిలావుంటే మే 12వ తేదీ నుంచి ఢిల్లీతో పాటు వివిధ ప్రాంతాలకు రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతున్న విషయం తెలిసిందే. వీటిలో ప్రయాణించేందుకు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికుల చిరునామాలను సేకరిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ ప్రకటించింది. దీని వల్ల టికెట్ బుక్ చేసుకున్నవారి చిరునామాగల ప్రాంతంలో కరోనావ్యాప్తి ఏ స్థాయిలో ఉందో తెలుసుకుని అందుకు తగ్గ చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. 13వ తేదీ నుంచి ప్రయాణికుల చిరునామాలను సేకరించడం ప్రారంభించినట్లు పేర్కొంది. బుకింగ్స్ ప్రారంభించిన కొన్ని గంటల్లోనే సుమారు 54వేల మంది ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్నారని ఐఆర్‌సీటీసీ వెల్లడించింది, దీని ద్వారా సుమారు రూ10కోట్ల ఆదాయం సమకూరినట్లు రైల్వేశాఖ పేర్కొంది. ప్రత్యేక రైళ్ళు, శ్రామిక్‌రైళ్లు మినహా 2020 జూన్ 30 వరకు బుక్ చేసుకున్న అన్ని టికెట్లను రైల్వేశాఖ రద్దు చేసింది. జూన్ 30వరకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికు లందరికీ టికెట్ మొత్తం నగదును రీఫండ్ చేయనున్నట్లు పేర్కొంది. ప్రత్యేక రైళ్లలో ప్రయాణించే వారు తమ ఆహారం తెచ్చుకోవడంతో పాటు గంటన్నర ముందుగానే స్టేషన్‌కు చేరుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించింది. వివిధ ప్రాంతాల్లో చిక్కుకున్న వలస కార్మికులు, యాత్రికులు, పర్యాటకులు, విద్యార్థుల కోసం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రైల్వేశాఖ ఈ ప్రత్యేక, శ్రామిక రైళ్లు నడుపుతుంది. శ్రామిక్ రైళ్లలో ప్రయాణించే వారికి మాత్రం రైలు ఎక్కే ముందు వైద్యపరీక్షలు చేయడంతో పాటు భోజనం, నీరు ఉచితంగా అందిస్తారు.

# కరోనా లాక్‌డౌన్‌లో పాక్ కుట్రలు

### గిల్గిత్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్‌ల వాతావరణ ప్రకటనలతో ఇరకాటం

### కాశ్మీర్‌లో పాచిక పారకపోవడంతో ఇమ్రాన్ అక్కసు

న్యూఢిల్లీ,మే15(ఆర్ఎన్ఎ): కరోనా కాలంలో కూడా పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని పోత్సహిస్తూనే ఉన్నది. ఇటీవల సరిహద్దుల్లో సంఘటనలు కూడా ఇందుకు తాజా ఉదాహరణలు. అక్కడ ఉద్రిక్తతలను రగిల్చే కార్యక్రమాలు గతంలో లాగా పాక్‌కు సాధ్యం కావడం లేదు. ఇటీవల 370 రద్దు తరవాత కేంద్రం తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలతో పాక్ దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. కాశ్మీర్‌లో గతంలో లాగా కుట్రలు చేయడానికి అవకాశాలు లేకపోడంతో ప్రధాని ఇమ్రాన్ అక్కసు వెళ్లగక్కుతున్నారు. దీనిని ప్రపంచానికి తెలియచెప్పేందుకు భారత్ అన్ని అవకాశాలనూ వాడుకుంటూనే ఉంది. అసలే కరోనా కష్టాల్లో ఉన్న కశ్మీర్లో తిరిగి సీమాంతర ఉగ్రవాదం పెరగడం అక్కడి ప్రజలకు మరిన్ని కష్టాలు తెచ్చిపెడుతున్నది. ఆర్మీ అధికారులు నేలకొరిగిన రెండురో జుల్లోనే అందుకు ప్రతీకారంగా హిజ్బుల్ ముజాహిదీన్ కీలక కమాండర్ రియాజ్ నాయకూను మన భద్రతాదళాలు మట్టుబెట్టాయి. ఈ సంస్థకు చెందిన అతిముఖ్యమైన నాయకులు కూడా సైన్యం చేతికి చిక్కారు. కశ్మీర్‌లో వివిధ ఉగ్రవాద సంస్థలకు చెందిన కీలక నాయకులు ఇలా నేలకొరుగుతున్న తరుణంలో పాకిస్థాన్‌కు దిక్కుతోచడం లేదు. బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్ తరువాత కశ్మీర్ రగిలిపోయినట్టుగా, మరో కీలకనాయకుడు రియాజ్ నాయకూ మరణంతో వారికి దిక్కులేకుండా పోయింది. ఇంటర్నెట్ సహా సమస్త సమాచార వ్యవస్థలనూ నిలిపివేయడంతో పాటు కట్టుదిట్టమైన చర్యల మధ్య స్థానిక మిలిటెంట్లనూ, సీమాంతర ఉగ్రవాదులను భద్రతాదళాలు ఏరిపారేస్తున్నాయి. వేసవి తీవ్రమవుతున్నకొద్దీ మరిన్ని చొరబాట్లకు పాకిస్థాన్ సిద్ధపడుతున్నది. సరిహద్దుల్లో కనీసం నూటయాభైమంది ఉగ్రవాదులు తిష్టవేసుకొని కశ్మీర్‌లోకి చొరబడే అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, పాకిస్థాన్ కుట్రలను వమ్ముచేయడం, అంతర్జాతీయంగా దానిని ఏకాకి చేయడం కోసం భారత్ అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటోంది. ఇదిలావుంటే షాంఘై సహకార సంస్థ సమావేశంలో భారత్, పాకిస్థాన్ విదేశాంగమంత్రులు పరోక్షంగా ఘాటైన విమర్శలు చేసుకున్నారు. ప్రపంచమంతా కరోనా వైరస్ మీద సంఘటితంగా పోరాడుతుంటే, కొన్ని దేశాలు అంతకంటే ప్రమాదకరమైన ఉగ్రవాద వైరస్ వ్యాప్తికి ప్రయత్నిస్తున్నాయని భారత విదేశాంగ మంత్రి జయశంకర్ వ్యాఖ్యానించారు. భారతప్రధాని నరేంద్రమోదీ సోమవారం అలీన దేశాల సదస్సులో పాల్గొన్నప్పుడు కూడా ఉగ్రవాదం గురించే ప్రముఖంగా మాట్లాడారు. మోదీ ప్రధాని అయిన తరువాత 'నామ్' నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొనడం ఇదే ప్రథమం. ముప్పైదేశాధినేతల మధ్య జరిగిన వీడియో కాన్ఫరెన్సులో మోదీ కరోనాపై సంఘటిత పోరు అవసరాన్ని ప్రకటిస్తూనే, ఈ సంకటస్థితి మధ్య కొన్ని దేశాలు తప్పుడు వార్తలతోనూ, కల్పిత వీడియోల తోనూ సమాజాలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయంటూ వ్యాఖ్యానించారు. మొన్నటికి మొన్న పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రధానమంత్రి ఫరూఖ్ ఏకంగా భారతదేశంమీద యుద్ధానికి సిద్ధపడాలని ఇమ్రాన్ ఖాన్‌ను కోరారు. భారతదేశానికి మాటలతో చెబితే సరిపోదనీ, చేతలతోనే చూపాలని ఆయన వ్యాఖ్యానించారు. దూరదర్శన్, ఆకాశవాణి తమ వాతావరణ వివరాల్లో పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగాన్ని చేర్చడం ఈ తీవ్ర వ్యాఖ్యలకు ఆధారంగా ఆయన వాడుకున్నారు. గిల్గిత్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్, మీర్‌పూర్ ఇత్యాది ప్రాంతాలకు సంబంధించిన వాతావరణ విశేషాలను కూడా మన అధికారిక ప్రసార మాధ్యమాలు ప్రకటించడం మొదలుపెట్టగానే, ఇందుకు ప్రతిగా శ్రీనగర్, పుల్వామా, లద్దాఖ్ గరిష్ట కనిష్ఠ ఉష్ణోగ్రతలను పాకిస్థాన్ రేడియో మొన్న పదవతేదీ నుంచి చెప్పడం ఆరంభించింది. ఈ వాతావరణ యుద్ధాన్ని అటుంచితే, కరోనా కారణంగా కొద్దిరోజులు ఇరుదేశాల మధ్యా ఉపశమించిన ఉద్రిక్తత ఇటీవల తిరిగి పుంజుకుంది. పదిరోజుల క్రితం ఉత్తర కశ్మీర్‌లోని హంద్వారా సెక్టార్‌లో పదహారుగంటల పాటు కొనసాగిన ఎన్‌కౌంటర్ చూస్తే పాకిస్థాన్ వైఖరిలో ఏ మార్పురాలేదని చెప్పాలి. ఈ ఘటనలో ఉగ్రవాదులతో పోరాడుతూ సైన్యంలోని అత్యున్నత స్థాయి అధికారులతో సహా ఆరుగురు మరణించారు. ఆ మర్నాడు సమీప గ్రామంలో కొందరు ఉగ్రవాదులు సీఆర్‌పిఎఫ్ జవాన్లపై దాడిచేసి ముగ్గుర్ని చంపిశారు. దేశభద్రత రీత్యా ఎంతో కీలకమైన హంద్వారా సెక్టార్‌ను కావలికాయడం, అక్కడినుంచి భారతదే శంలోకి ఉగ్రవాదులను జొప్పించేందుకు పాకిస్థాన్ సైన్యం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టడం ఎంతో కష్టమైనపని. హఠాత్తుగా విరుచుకుపడే ఉగ్రవాదులను మట్టుబెట్టే ప్రయత్నంలో మన సైనికుల ప్రాణాలు పెద్ద సంఖ్యలో పోతున్నప్పటికీ, పాక్ సైన్యం ఎత్తుగడలను తిప్పికొట్టడంలో వారు అంతిమవిజయం సాధిస్తూనే ఉన్నారు.అయితే పాక్ కుట్రలను తిప్పికొడుతూ సరిహద్దుల్లో సైన్యం నిరంతరంగా శ్రమిస్తూనే ఉంది.

# దుబ్బాక ప్రధాన కాలువను పరిశీలించిన హరీశ్‌రావు



సిద్దిపేట, మే 15: కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ-12 ద్వారా దుబ్బాకకు నీళ్లు అందించే ప్రధాన కాలువను మంత్రి హరీశ్ రావు పరిశీలించారు. సిద్దిపేట జిల్లాలోని తొగుట మండలం తుక్కాపూర్ నుంచి కాలువ వెంట సుమారు 40 కిలోమీటర్లు ఆయన పర్యటించారు. ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోలిపేట లింగారెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి దుబ్బాక ప్రధాన కాలువను పరిశీలించారు. ప్రధాన కాలువలో పలుచోట్ల పనులు అసంపూర్తిగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే పనులను పూర్తిచేయాలని ఆదేశించారు.

# కరోనాతో మారనున్న విద్యాసంవత్సరం

### పిల్లలను బడికి పంపడానికి జంకుతున్న పేరెంట్స్

### కేంద్ర ఆదేశాల మేరకే నడుచుకునే అవకాశం

అమరావతి,మే15(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ మారనుంది. ప్రతీ ఏటా జూన్ 12న పాఠశాలలు ప్రారంభమవుతాయి. కరోనా వైరస్ వల్ల విధించిన లాక్‌డౌన్‌తో ఈ ఏడాది క్యాలెండర్ అర్థాంతరంగా ముగిసింది. దీంతో పాఠశాలలు ఎప్పుడు మొదలవుతాయా అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. జూన్‌లో లాక్‌డౌన్ ఎత్తివేస్తే సాధారణంగానే పాఠశాలలు ప్రారంభిం చాలని, లేదంటే అకడమిక్ క్యాలెండర్‌ను ఈ ఏడాదికి మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇప్పటికిప్పుడు పిల్లలను స్కూళ్లకు పంపేది లేదని తల్లిదండ్రుల కూడా భావిస్తున్నారు. పిల్లలను చదువుల కోసం పంపి కరోనా బారిన పడేయలేమని అంటున్నారు. ఇటీవల విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. లాక్‌డౌన్ కొనసాగితే ఈ విద్యాసంవత్సరం ఆగస్టు నుంచి 2021 ఏప్రిల్ వరకు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు కూడా సూచించాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) ఆగస్టు నుంచి నూతన విద్యాసంవత్సరం ఉంటుందని ప్రకటించింది. పాఠశాల విద్యాశాఖ క్యాలెండర్ మార్పు కూడా తథ్యమని, అయితే ఎప్పటి నుంచి ఉంటుందో ప్రభుత్వమే నిర్ణయించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రతి ఏటా ఈ సమయానికి పాఠ్యాంశ పుస్తకాలను ముద్రించి పాఠశాలలకు పంపించడం ప్రారంభమ వుతుంది. జిల్లా, మండల విద్యాశాఖ అధికారుల వద్దకు చేరుకున్న పాఠ్యాంశ పుస్తకాలను పాఠశాలలకు పంపించొద్దని ఈసారి విద్యాశాఖ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో అకడమిక్ క్యాలెండర్ మార్పు ఖాయమని కిందిస్థాయి అధికారులు భావిస్తున్నారు. ప్రతి ఏటా జూన్ 12 నుంచి ఏప్రిల్ 24 వరకు సెలవులు పోనూ 220 పని దినాలు ఉండాలని రాష్ట్రవిద్యా పరిశోధన మండలి (ఎస్‌సిఈఆర్‌టి) నిర్ణయించేది. ఆగస్టు నుంచి ఏప్రిల్ 30 వరకు ఉంటే దసరా, దీపావళి, సంక్రాంతి సెలవులతో పాటు రెండో శనివారం, ఇతర సెలవులను కూడా కుదించాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా పనిదినాలు కూడా తగ్గించాల్సి వస్తుందని అంటున్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తరువాతే తాము క్యాలెండర్ రూపొందించగలమని ఎస్‌సిఈఆర్‌టి ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరోవైపు జులైలో టెన్త్ ఎగ్జామ్స్ షెడ్యూల్ విడుదల అయ్యింది. 15నాటికి పరీక్షలు పూర్తవుతాయి. తరవాత ఫలితాలు, ఇతర ఎంట్రెన్సుల మడావిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆగస్టులో మాత్రమే విద్యా సంవత్సరం మొదలు కావచ్చని అంటున్నారు. అదికూడా కరోనా తగ్గుదలను బట్టి, కేంద్రం ఇచ్చే ఆదేశాల మేరకు ఉండొచ్చంటున్నారు.

# మంత్రి సబితకు స్వల్ప అస్వస్థత

### క్షేమంగానే ఉన్నారంటూ మంత్రి కార్యాలయం వెల్లడి

హైదరాబాద్,మే15(ఆర్ఎన్ఎ): తెలంగాణ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అస్వస్థతకు గురయ్యారు.

అర్ధరాత్రి ఛాతినొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. సబితా ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెబుతున్నారు. మంత్రి సబితా ఆరోగ్యంపై పలువురు మంత్రులు, నేతలు.. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. సబిత ఆరోగ్యంపై ఇంతవరకూ కుటుంబ సభ్యులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. మంత్రికి ఆరోగ్యం సర్లేదన్న విషయం తెలుసుకున్న అభిమానులు, కార్యకర్తలు తీవ్ర ఆందోళన చెందారు. పెద్ద ఎత్తున అనుచరులు, కార్యకర్తలు, అభిమానులు సబితా ఇంటికి.. ఆమె చికిత్స తీసుకుంటున్న ఆస్పత్రికి తరలివెళ్లినట్లు తెలుస్తోంది. కాగా ఇందుకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. అయితే తాజాగా విద్యా శాఖ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. సబితా ఇంద్రారెడ్డి అభిమానులు, పార్టీ కార్యకర్తలు, అనుచరులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. సబితా సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు. స్వల్ప అస్వస్థతతో ఆస్పత్రికి వెళ్లారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించగా రిపోర్ట్‌లు నార్మల్‌గానే వచ్చాయి. డిశ్చార్జ్ అయ్యి.. ఇంటికి చేరుకోనున్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అందరి ఆదరాభిమానాలు, దేవుని కృపతో మంత్రి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని విద్యాశాఖ మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

# రైతుల పక్షాన పోరాడితే కేసులా?: పొన్నం

కరీంనగర్,మే15(నేటినిజం ప్రతినిధి): రైతు సమస్యలపై పోరాడితే కేసులు పెడతారా? అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మాకు వర్తించే జీవోలు టీఆర్ఎస్ మంత్రులు, నాయకులకు వర్తించవా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను అడ్డుకోవాలని ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమన్నారు. ఇతర రాష్ట్రాలను చూసైనా కేసీఆర్ బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ముఖ్యమంత్రి గొప్పలు చెప్పడం తప్ప చేసేదేమీ లేదన్నారు. జిల్లాలో నలుగురు మంత్రులు ఉన్నా ధాన్యం కొనుగోళ్లు ఎందుకు వేగవంతం కావడం లేదని ప్రశ్నించారు. రైస్ మిల్లర్లకు సమస్యలు ఉంటే ప్రభుత్వ పెద్దలతో చర్చించుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టడం సబబు కాదన్నారు. నల్గొండ జిల్లాలో 100 శాతం కొనుగోళ్లు జరిగితే ఎందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. చెప్పిన పంట వేస్తేనే రైతుబంధు ఇస్తా అనడం సిగ్గుచేటని పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.త

# లాక్‌డౌన్ మరో రెండువారాలు పొడిగించాల్సిందిగా కేంద్రానికి లేఖ

గౌహతి, మే 15 : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ గడువు మరో రెండు రోజుల్లో ముగియనున్న సంగతి తెలిసిందే. కాగా కోవిడ్-19 తీవ్రత దృష్ట్యా లాక్‌డౌన్ పిరియడ్‌ను మరో రెండు వారాలు పొడిగించాల్సిందిగా కోరుతూ అసోం ముఖ్యమంత్రి సర్బనంద సోనోవాల్ నేడు కేంద్రానికి లేఖ రాశారు. లాక్‌డౌన్‌పై అభిప్రాయాలు చెప్పాలిందిగా కేంద్రం రాష్ట్రాలకు నేటి వరకు గడువిచ్చింది. తమ ప్రభుత్వ నిర్ణయాన్ని ఇప్పటికే కేంద్రానికి తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూద్దామన్నారు. గడిచిన 24 గంటల్లో గౌహతిలో కొత్తగా 22 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో అసోంలో కేసుల సంఖ్య 87కు చేరింది. కోవిడ్-19 కారణంగా అసోంలో ఇప్పటి వరకు ఇద్దరు మరణించారు. 41 మంది వ్యాధి నుంచి కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. 43 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. కేసుల దృష్ట్యా గౌహతిలోని తొమ్మిది ప్రాంతాలను కంటైన్మెంట్ జోన్లుగా ప్రభుత్వం ప్రకటించింది.



# నైరుతి రుతుపవనాలు ఆలస్యం!

న్యూఢిల్లీ,మే 15 : ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. కేరళ మీదుగా వచ్చే రుతుపవనాల్లో కొంత ఆలస్యం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు రావాలి. కానీ ఈ ఏడాది జూన్ 5వ తేదీకి 4 రోజుల ముందు లేదా తర్వాత వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

# చైనాతో క్షీణిస్తున్న అమెరికా సంబంధాలు

## జీ జిన్‌పింగ్‌తో చర్చలకు ఆస్కారం లేదన్న ట్రంప్

వాషింగ్టన్,మే15(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ ఎత్తివేత కరోనా విజృంభణకు కారణమవుతోందా లేదా అనేది తేలేందుకు కొద్ది వారాలు పడుతుందని ఆరోగ్య రంగ నిపుణులు పేర్కొంటున్నారు. చైనాపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన కొవిడ్-19 జవాబుదారీ చట్టంను తాను పరిశీలించాల్సి ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. దీని ప్రకారం ఆస్తుల ఫ్రీజ్, ప్రయాణాల రద్దు, వీసా ఆంక్షలు సహా తీవ్రమైన చర్యలు తీసుకునేందుకు అధికారం అధ్యక్షుడికి ఉంది. కాగా ఈ ప్రయత్నాలను చైనా కొట్టిపడేసింది. కరోనాపై డబ్ల్యూహెచ్‌వోకు తొలిగా సమాచారం ఇచ్చింది తామేనని పేర్కొంది. మరోవైపు దేశంలో ఏప్రిల్‌లో నిరుద్యోగిత 14.7 శాతానికి చేరిందని, 1930 నాటి మహా మాంద్యం తర్వాత ఇదే అత్యధికమని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షలపై జాతీయ స్థాయిలో మార్గదర్శకాలు అవసరమని సూచిస్తున్నారు. పాఠశాలల పునఃప్రారంభం దిశగా చర్యలు చేపట్టాలని రాష్ట్రాల గవర్నర్లను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. పిల్లలపై వైరస్ ప్రభావం పట్ల జాగ్రత్తగా ఉండాలని వైట్‌హౌస్ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు డాక్టర్ ఆంథోని ఫౌసి చేసిన సూచనలను ఆయన పట్టించుకోలేదు. దాదాపు 25 రాష్ట్రాలు లాక్‌డౌన్ ఎత్తివేతకు సిద్ధమవుతున్న తరుణంలో.. ఒక్కసారి పరిస్థితి చేయిదాటితే తిరిగి కోలుకోలేమని ఫౌసి హెచ్చరించారు. కరోనావైరస్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3 లక్షలమందిని పొట్టన పెట్టుకోగా, ఇందులో 86 వేలకు పైగా మరణాలు అమెరికాలోనే నమోదు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా ప్రకటన వెలువడింది. కాగా కోవిడ్-19 వ్యాప్తి విషయంలో చైనాపై తీవ్ర స్థాయిలో విరుచుకు పడుతున్న ట్రంప్ ప్రతీకారంగా చైనా ఈక్విటీ మార్కెట్లలో పెట్టాలని నిర్ణయించిన భారీ పెట్టుబడుల్ని నిలిపివేయాలని యోచిస్తున్నట్లు ఇటీవల వార్తలు వ్యాపించిన సంగతి తెలిసిందే. కరోనావైరస్ మహమ్మారి విషయంలో చైనా ప్రపంచాన్ని మోసం చేసిందంటూ పదే పదే విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తో చర్చలు జరిపే మానసిక స్థితి తనకు లేదని మండిపడ్డారు. అంతేకాదు చైనాతో ఉన్న అన్ని సంబంధాలను తెంచుకోనున్నామని, జిన్‌పింగ్‌తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఫాక్స్ బిజినెస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ట్రంప్ తాజా హెచ్చరికలు చేశారు. తాము చేయాల్సినవి చాలా వున్నాయి...చైనాతో మొత్తం సంబంధాలను తెంచుకునే యోచనలో ఉన్నామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. నిజానికి జీ జిన్‌పింగ్ తనకు చాలా మంచి సంబంధాలే ఉన్నాయనీ, కానీ ప్రస్తుతం అతనితో మాట్లాడే ఆసక్తిలేదు. చాలా నిరాశకు గురయ్యానని ట్రంప్ వ్యాఖ్యానించారు. కరోనా వైరస్ వ్యాప్తి విషయంలో చైనా సరిగా వ్యవహరించలేదని, వైరస్ వ్యాప్తిని ఆపి వుండాల్సిందంటూ మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే చైనా పెట్టుబడుల నుండి యుఎస్ పెన్షన్ ఫండ్‌ను ఉపసంహరించుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# కేరళలో మరోమారు కరోనా కలకలం

## మళ్లీ పెరుగుతున్న పాజిటివ్ కేసులు
## తాజాగా గల్ఫ్ నుంచి వచ్చిన వారితో తంటాలు
## పరీక్షలు జరపకుండా వెనక్కి రప్పించడంపై సిఎం అభ్యంతరం

తిరువనంతపురం,మే15(ఆర్ఎన్ఎ): గతవారం వరకు ప్రశాంతంగా ఉన్న కేరళలో కరోనా వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. తాజాగా మరో 26 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గడిచిన నాలుగు రోజులుగా కొత్త కేసులు నమోదువుతూనే ఉన్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. తాజాగా గల్ఫ్ దేశాల నుంచి వచ్చిన వారి వల్ల కేసులు నమోదు అవుతున్నాయని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఎలాంటి పరీక్షలు లేకుండా వారిని తీసుకుని రావడం వల్లే ఉపద్రవం ముంచుకొస్తోందని అంటోంది. దేశంలో తొలి కరోనా కేసు కేరళలోనే నమోదు అయినప్పటికీ ప్రభుత్వం, అధికారులు, ప్రజల కఠిన చర్యలతో వైరస్‌ను పూర్తిగా కట్టడి చేయగలిగారు. లాక్‌డౌన్ నిబంధనలను కఠినంగా పాటించారు. జీరో కరోనా పాజిటివ్ కేసులతో దేశమంతా కేరళ వైపు తిరిగిచూసే విధంగా ఆ రాష్ట్ర ప్రజలు వైరస్‌పై యుద్ధంలో విజయం సాధించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముందే ఊహించిన విధంగా విదేశాల నుంచి వచ్చిన వారు కొత్త సమస్యను తెచ్చిపెడుతున్నారు. విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారి వల్ల మళ్లీ పరిస్థితి తిరిగి మొదటి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు కొత్తగా నమోదయ్యే కేసులన్నీ విదేశాల నుంచి వచ్చిన వారి నుంచే అని తెలిసింది. విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారికి ముందుగానే పరీక్షలు నిర్వహించిన క్వారెంటైన్ కేంద్రాలకు పంపుతున్నామని ఓ సీనియర్ అధికారి తెలిపారు. మొత్తం 600కుపైగా పరీక్షలు నిర్వహించగా 68 పాజిటివ్ కేసులు తేలినట్లు వెల్లడించారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాల నుంచి వచ్చిన వారిలోనే ఎక్కువ లక్షణాలు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా లాక్‌డౌన్ కారణంగా విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను తరలించడంతో పెను ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్ర ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించిన విషయం తెలిసిందే. వారికి ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా స్వదేశానికి తీసుకురావడం సరైన విధానం కాదని కేంద్రానికి తెలియజేశారు. ఈ మేరకు మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజయన్ లేఖ రాశారు. లాక్‌డౌన్ కారణంగా వివిధ దేశాల్లో చిక్కుకున్న భారతీయులను ప్రత్యేక విమానాల ద్వారా స్వదేశానికి తీసుకురా వాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తప్పుపట్టారు. కరోనా పరీక్షలు నిర్వహిం చకుండా విదేశాల్లో ఉన్న భారతీయులను తరలించడం సరైనది కాదని కేంద్రానికి సూచించారు. ఇది చాలా ప్రమాదకరమైన నిర్ణయమని విజయన్ అభిప్రాయపడ్డారు. కాగా 13 దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను 64 ప్రత్యేక విమానాల ద్వారా భారత్‌కు తరలించాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి విజయన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు.



బెంగాల్‌కు బయలుదేరిన వలసకూలీలను సరిహద్దు జిల్లా అశ్వారావుపేట వద్ద అడ్డుకున్న ఆంధ్రా పోలీసులు

# కాళేశ్వరంతో నిర్మల్ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు

## కాలువ రైతులకు పరిహారం చెక్కులు అందించిన మంత్రి

నిర్మల్,మే15(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం పూర్తయితే నిర్మల్ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందనిమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. దీంతో రైతులకు నీటి సమస్యలు ఉండవన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 27, 28 కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ నష్టపరిహారం అందిస్తామని మంత్రి అన్నారు. ప్యాకేజీ 28 ద్వారా నష్టపోయిన మొత్తం 113 మంది రైతులకు రూ. 8.12కోట్ల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ప్యాకేజీ 27, 28 పనులు పూర్తయితే నిర్మల్ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. వీలైనంత తొందరగా కాలువల నిర్మాణం పూర్తిచేసి ప్రతి రైతుకు నీరందించేందుకు కృషిచేస్తానన్నారు. కరోనా వైరస్ వల్ల ఆర్థికంగా ఎన్ని ఇంబ్బందులు ఎదురైనా రైతులకు చేయూతనందిం చడానికి సీఎం కేసీఆర్ వెనుకంజవేయడం లేదని తెలిపారు. రైతు రుణమాఫీ, వానాకాలం సాగుకు రైతుబంధు కోసం రూ. 8120 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు లైన్లలో నిలబడేవారని, తెలంగాణ రాష్ట్రం వచ్చినతర్వాత ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని రైతులు సకాలంలో పంటలు వేసుకోవాలని సూచించారు. ఇదిలావుంటే ధర్మసాగర్ చెరువు సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముషర్రఫ్ ఫారూఖీ నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ పట్టణంలోని ధర్మసాగర్ చెరువును అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ధర్మసాగర్ చెరువు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. చెరువులోని నీటిని మొత్తం విడుదల చేసి అందులో ఉన్న గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాలన్నారు. చెరువు చుట్టూ పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనంపెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ముందర పచ్చదనం, అభివృద్ధి పనులకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి వెంటనే పనులను ప్రారంభించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

# హెల్త్ స్క్రీనింగ్ వెబ్ యాప్ ను ప్రారంభించిన అమర రాజ గ్రూప్

తిరుపతి, మే 15 : ప్రముఖ ఆటోమోటివ్ బ్యాటరీ సంస్థ అమర రాజ గ్రూప్ తమ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులోభాగంగా కరోనా నేపథ్యం లో 16వేల మంది ఉద్యోగులకు హెల్త్ స్క్రీనింగ్ వెబ్ యాప్ ను ప్రారంభించడంతో పాటు ,డిజిటల్ ప్లాట్ ఫామ్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అమర రాజ గ్రూప్ ప్రకటించింది. ఈ వెబ్ యాప్, ఆన్లైన్ స్క్రీనింగ్ సాధనాన్ని అందిస్తుంది. ఆ సాధనంలో కరోనావైరస్ వ్యాధి గురించిన సమాచారాన్ని అందించడంతో పాటు సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సిడిసి), ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)ఆరోగ్య మంత్రిత్వ శాఖ ల మార్గదర్శకాల జాబితాను అందిస్తుంది. ఒక ఉద్యోగి కరోనా బారిన పడితే ఎంత ప్రమాదమో దీని ద్వారా తెలుసుకోవచ్చు. 'అమరా రాజా పీపుల్ సేఫ్టీ మేనేజ్మెంట్ సిస్టమ్' (ఒఖీఖూటా) అనే వెబ్ యాప్ ను డాక్సివా సహకారంతో రూపొందించారు. అమర రాజ సంస్థ ఉద్యోగులు , వారి కుటుంబ సభ్యులకు కోవిడ్ -19 స్వీయ స్క్రీనింగ్ అసెస్మెంట్ సాధనాలను ఉపయోగించి వ్యాధి ప్రమాదాన్నిగుర్తించే అవకాశాన్ని అందిస్తున్నారు. అమరా రాజా ఉద్యోగులందరూ కరోనా లక్షణాలు , ఎక్స్‌పో జర్ హిస్టరీ కోసం రోజువారీ ప్రాతిపదికన పరీక్షకు సంబంధించిన ప్రశ్నలను పూరించాలి. దీని ఆధారంగా వెబ్ యాప్ స్వయంచాలకంగా తాత్కాలిక ఇ-వర్క్ పాస్ ను జారీ చేస్తుంది. ఈ ప్రక్రియను సులభంగా అర్థం చేసుకోవడానికి క్యూఆర్ కోడ్ లతో ఉన్న వివరణాత్మక యూజర్ గైడ్ ను ఉద్యోగులందరికీ అందించారు. ఉద్యోగుల డిజిటల్ ప్లాట్ ఫామ్ 'చిఇ ఏ ఒఖీ'. జియో ట్యాగింగ్ ను ఉపయోగించి, సంస్థ ఉద్యోగి స్థానాన్ని అర్థం చేసుకోగలదు. సేకరించిన డేటా ఏదేని అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అందుబాటులో ఉంచడానికి ఉపయోగపడుతుంది. అమరా రాజా ఉద్యోగులందరికీ భారత ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య సేతు యాప్ ను ఉపయోగించుకోవాలని అమరరాజా గ్రూప్ ప్రెసిడెంట్ గల్లా విజయ నాయుడు సూచించారు. "కొత్తగా ప్రారంభించిన అమరా రాజా పీపుల్ సేఫ్టీ మేనేజ్మెంట్ సిస్టమ్ ఉద్యోగుల డిజిటల్ ప్లాట్ ఫామ్ 'చిఇ ఏ ఒఖీ' మా ఉద్యోగులందరితోపాటు వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉండటానికి ఇది ఏంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం అమరా రాజా పీపుల్ సేఫ్టీ మేనేజ్మెంట్ సిస్టమ్ వెబ్ యాప్ తెలుగు ,ఆంగ్ల భాషల్లో లభిస్తున్నది.

# అదనపు ఆహార పదార్థాలు పంపేందుకు ఎఫ్‌సీఐ సిద్ధం : రాం విలాస్ పాశ్వాన్

ఢిల్లీ, మే15: వలస కార్మికుల కోసం రాష్ట్రాలకు అదనపు ఆహార పదార్థాలు పంపేందుకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) సిద్ధంగా ఉందని ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ మంత్రి రాం విలాస్ పాశ్వాన్ తెలిపారు.

ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా వలస కూలీలను ఆదుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టిం దన్నారు.

ఒక్కో వలస కూలీకి ఐదు కిలోల బియ్యం, కేజీ పప్పును అందిచనున్నట్లు తెలిపారు. ఉచితంగానే రెండు నెలల(మే, జూన్) పాటు అందజేయనున్నట్లు చెప్పారు. వలస కూలీలు నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ కింద కవర్ కావడం లేదు. లాక్‌డౌన్ నేపథ్యంలో రేషన్ కార్డు లేకుండా రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వలస కూలీలు ఈ స్కీమ్ కింద అర్హులన్నారు.

దాదాపు 8 కోట్ల మంది ఈ పథకం కింద అర్హులు కానున్నట్లు తెలిపారు. కేంద్రమే రూ. 3,500 ను ఖర్చు చేసి 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, 50 వేల మెట్రిక్ టన్నుల పప్పును వలస కూలీల నిమిత్తం అందిస్తున్నట్లు తెలిపారు.

# అసోంలో ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ బీభత్సం

## దాదాపు 15 వేల పందులు మృత్యువాత
## కేంద్రానికి నివేదించామన్న మంత్రి అతుల్ బోరా

గౌహతి,మే15(ఆర్ఎన్ఎ): భారత్‌లో ఓ వైపు కరోనా వైరస్ విజృంభిస్తుంటే ఈశాన్య భారతంలో ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ బీభత్సం సృష్టిస్తోంది. ఈ వైరస్ బారినపడి అసోంలో ఇప్పటి వరకు దాదాపు 15 వేల పందులు మృత్యువాతపడ్డాయి. ఇక రాష్ట్రంలో పెరుగుతున్న ఈ సంక్షోభం కారణంగా తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామని అసోం పశు సంవర్ధక శాఖ మంత్రి అతుల్ బోరా తెలిపారు. రోజురోజుకీ పందుల మరణాలు పెరుతున్నాయని, ప్రస్తుతం వైరస్ ప్రభావం పది జిల్లాలకు సోకిందని పేర్కొన్నారు. ఇప్పటికే 14,919 పందులు చనిపోయాయని, వీటి సంఖ్య మరింత పెరుగుతోందన్నారు. ఈ క్రమంలో పరిస్థితిని కేంద్రానికి వివరించి అప్రమత్తం చేశామని తెలిపారు మరోవైపు బాధిత పది జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ జారీ చేసింది. ఫిబ్రవరిలో ఇక్కడ తొలి స్వైన్ ఫీవర్ కేసు నమోదైన తరవాత ఇంతగా వ్యాప్తి చెందడం ఆందోళన కలిగిస్తోంది. అది కాస్తా క్రమంగా తీవ్ర రూపం దాల్చడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వ్యాధి నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు పందులను సామూహికంగా చంపేందుకు స్థానిక ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే కేవలం వైరస్ సోకిన పందులను మాత్రమే చంపాలని నిర్ణయించింది. ఇక వ్యాధి బారిన పడి చనిపోయిన పందులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. పందులను పెంచే రైతులకు ఒకే విడతలో రూ.144 కోట్ల ఆర్థిక ప్యాకేజీని అందించాలని కేంద్రాన్ని కోరింది. ఆఫ్రికన్ స్వైన్ ఫీవర్ అనేది జంతువులకు సోకే వైరస్. ఇది మనుషులకు వ్యాప్తి చెందదు. ఒక జంతువు నుంచి ఇతర జంతువులకు సోకే ఈ వైరస్ భారత్‌లో వ్యాపించడం ఇదే మొదటిసారి. చైనా నుంచి ఈ వ్యాధి వచ్చినట్లు అసోం పేర్కొంది. ఇది ప్రస్తుతం అరుణాచల్ ప్రదేశ్‌లో కూడా వ్యాపించింది.

# ఏపిలో కొత్తగా మరో 57 పాజిటివ్ కేసులు

## 60 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు
## హెల్త్ బులిటెన్ విడుదల చేసిన ఆరోగ్య శాఖ

హైదరాబాద్,మే15(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో గత 24 గంటల్లో కొత్తగా 57 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 2157కు చేరింది. ఈ వైరస్ వల్ల రాష్ట్రంలో ఇప్పటి వరకు 48 మంది మృతిచెందారు. ఇంకా 857 యాక్టివ్ కేసులు ఉండగా, 1252 మంది బాధితులు కోలుకున్నారు. గత 24 గంటల్లో 60 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ఈ రోజు నమోదైన కేసుల్లో చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 14 చొప్పున ఉండగా, కృష్ణాలో 9, కర్నూలులో 8, అనంతపురంలో 4, విజయనగరంలో 3, విశాఖపట్నం, కడపలో రెండు చొప్పున, తూర్పుగోదావరిలో ఒకటి కేసు

నమోదయ్యాయి. గత వారం రోజులుగా కరోనా పాజిటివ్ కేసులు తక్కువగానే నమోదయినప్పటికీ ఇవాళ మళ్లీ పెరిగాయ్. గడిచిన 24 గంటల్లో కొత్తగా 57 కేసులు నమోదయ్యాయని వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ బులెటిన్‌లో వెల్లడించింది. గురువారం రోజు ప్రకటించిన బులెటిన్‌లో కర్నూలు జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. అయితే తాజాగా 08 కేసులు నమోదు కావడం గమనార్హం. రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో అంటే గురువారం ఉదయం 9గంటల నుంచి.. శుక్రవారం 9 గంటల వరకూ 9,038 శాంపిల్స్‌ను పరీక్షించగా 102 మంది కోవిడ్19 పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ బులెటిన్‌లో పేర్కొంది. వీటిలో 45 పాజిటివ్ కేసులు ఇతర రాష్ట్రాలకి చెందినవి. రాష్ట్రంలో నమోదైన మొత్తం 2157 పాజిటివ్ కేసులకు గాను 1252 మంది డిశ్చార్జ్ కాగా.. 48 మంది మరణించారు. గడిచిన 24 గంటలుగా రాష్ట్రంలో ఎటువంటి కరోనా మరణాలు సంభవించలేదు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారి సంఖ్య 857 అని ఆరోగ్య శాఖ తెలిపింది. ఇదిలా ఉంటే.. గడిచిన 24 గంటల్లో 60 మంది కరోనాను జయించి సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ చేయబడ్డారు. రాష్ట్రంలో మొత్తం డిశ్చార్జ్ అయిన వారి సంఖ్య 1252కి చేరుకుంది.

# భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం: మంత్రి అల్లోల



నిర్మల్, మే 15: కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 27, 28 కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ నష్టపరిహారం అందిస్తామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ప్యాకేజీ 28 ద్వారా నష్టపోయిన మొత్తం 113 మంది రైతులకు రూ. 8.12కోట్ల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ప్యాకేజీ 27, 28 పనులు పూర్తయితే నిర్మల్ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. వీలైనంత తొందరగా కాలువల నిర్మాణం పూర్తిచేసి ప్రతి రైతుకు నీరందించేందుకు కృషిచేస్తానన్నారు. కరోనా వైరస్ వల్ల ఆర్థికంగా ఎన్ని ఇంబ్బందులు ఎదురైనా రైతులకు చేయూతనందించడానికి సీఎం కేసీఆర్ వెనుకంజవేయడం లేదని తెలిపారు. రైతు రుణమాఫీ, వానాకాలం సాగుకు రైతుబంధు కోసం రూ. 8120 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు లైన్లలో నిలబడేవారని, తెలంగాణ రాష్ట్రం వచ్చినతర్వాత ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని రైతులు సకాలంలో పంటలు వేసుకోవాలని సూచించారు.

# తక్కువ ఖర్చుతో తయారుచేసే పీపీఈని రూపొందించిన భారత నావికాదళం

హైదరాబాద్, మే 15:తభారత నావికాదళం రూపొందించిన వ్యక్తిగత రక్షణ సామగ్రి (పీపీఈ)ని భారీగా ఉత్పత్తి చేసేదిశగా కీలక అడుగు పడింది. రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెల్ (ఐపీఎఫ్‌సీ) పేటెంట్ కోసం దరఖాస్తు చేసింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్‌డీసీ)తో కలిసి పేటెంట్ కోసం దరఖాస్తు చేసింది.



నావికాదళానికి చెందిన ఓ వైద్యుడు తక్కువ ఖర్చుతో తయారయ్యే కొత్త పీపీఈని కనుగొన్నారు. ముంబయిలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ నావల్ మెడిసిన్ (ఐఎన్ఎమ్)లో ఇటీవల సృష్టించిన 'ఇన్నోవేషన్ సెల్' ద్వారా ఈ విషయాన్ని ప్రకటించారు.

ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఇతర పీపీఈల కంటే ఎక్కువ రక్షణ ఇవ్వగలిగేలా, దీనిని ధరించిన వారి శ్వాసక్రియ ఇంకా సులభంగా ఉండేలా ప్రత్యేక వస్త్రంతో కొత్త పీపీఈని రూపొందించారు. భారత్‌లో సాధారణంగా కనిపించే వేడి, తేమతో కూడిన వాతావరణం నేపథ్యంలో కొత్త పీపీఈలు మరింత అనుకూలంగా ఉంటాయి. ఐసీఎమ్ఆర్ ఆమోదం ఉన్న ప్రయోగశాలలో కొత్త పీపీఈ సాంకేతికతను పరీక్షించి, ధృవీకరించారు.

కొత్త పీపీఈలను భారీగా ఉత్పత్తి చేయడంపై నావికాదళం, ఐపీఎఫ్‌సీ, ఎన్ఆర్‌డీసీకి చెందిన బృందం దృష్టి పెట్టింది. వీటిని వేగంగా ఉత్పత్తి చేయగల సంస్థలను ఎన్ఆర్‌డీసీ గుర్తించింది. కరోనాపై ముందుండి పోరాడుతున్న వైద్య నిపుణులకు అనువైన పీపీఈలను అందించడమే వైరస్‌పై యుద్ధంలో అతి ముఖ్యమైన, తక్షణావసరం.

ఎక్కువ పెట్టుబడి లేకుండా తక్కువ ఖర్చుతో దేశీయంగా ఉత్పత్తి చేయగలిగేలా ఇవి ఉండాలి. ఈ పీపీఈల తయారీపై ఆసక్తి ఉన్న సంస్థలు అనుమతి కోసం cmdnrdc@ nrdcindia.com qT సంప్రదించాలి.

నావికాదళానికి చెందిన ఆవిష్కర్తల బృందం, 'రక్ష గ్యాన్ శక్తి మిషన్' కింద ఏర్పాటయిన ఐపీఎఫ్‌సీతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోంది. 2018 నవంబర్‌లో దీనిని ఏర్పాటు చేసిన నాటి నుంచి దాదాపు 1500 మేధో సంబంధిత ఉత్పత్తులను ఆవిష్కరించారు.

# 'గోల్' ను ప్రారంభించిన కేంద్రమంత్రి అర్జున్ ముండా



ఢిల్లీ, మే 15 : కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి అర్జున్ ముండా నేడు గోల్ (గోయింగ్ ఆన్‌లైన్ యాజ్ లీడర్స్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫేస్‌బుక్ సహకారంతో గిరిజన యువతకు డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చే కార్యక్రమమే ఈ గోల్. వెబ్‌నార్ పోర్టల్ ద్వారా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో గిరిజన వ్యవహారాలశాఖ సహాయ మంత్రి రేణుకా సింగ్ సరుతా, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ దీపక్ ఖండేకర్, ఇతర సీనియర్ అధికారులు, ఫేస్‌బుక్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్జున్ ముండా మాట్లాడుతూ... డిజిటల్ మోడ్ ద్వారా గిరిజన యువతకు మెంటార్‌షిప్ అందించడానికి గోల్ కార్యక్రమం రూపొందించబడిందన్నారు. గిరిజన యువతలో దాగివున్న ప్రతిభను గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా వారి వ్యక్తిగత అభివృద్ధికి, మొత్తంగా గిరిజన సమాజ అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 5 వేల మంది యువ గిరిజన పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ఆర్టిస్టులకు డిజిటల్ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఔత్సాహిక గిరిజన యువత ఙనీజీశ్రీ.బితీతిఎజీశ్రీ.ఙనీల.తిని పోర్టల్‌కు లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జులై 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించున్నట్లు తెలిపారు. పరిశ్రమల నుంచి నిపుణులు, ఉపాధ్యాయులు మెంటార్‌లుగా goal.tribal.gov.in ని పోర్టల్‌కు లాగిన్ అయి దరఖాస్తు చేసుకోసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

# కోవిడ్-19 భారతదేశానికి సహాయం అందివ్వడానికి తోషిబా ముందుకు వచ్చింది

హైదరాబాద్, మే 15: ప్రముఖ తోషిబా సంస్థ స్థాపించబడినప్పటి నుండి "ప్రజలపట్ల, భవిష్యత్తుపట్ల మా నిబద్ధత" అన్న సంకల్పానికి కట్టుబడి ఉంది. ఈ మాటలు తోషిబా గ్రూప్ యొక్క లక్ష్యాన్ని వ్యక్తపరచడంతో బాటు, సంస్థ యొక్క విలువలను మరియు సమాజానికి మేము చేస్తున్న సేవలను తెలియజేస్తాయి,తోషిబా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ టొమోహియా ఈ సందర్భంగా మాట్లాడుతూ "ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి కరాళ నృత్యం చేస్తున్న ఈ విపత్కర పరిస్థితుల్లో మా ఉద్యోగుల, వారి కుటుంబాల, మా కస్టమర్ల మా వ్యాపార భాగస్వాముల భద్రతకు మేము అత్యంత ప్రాధాన్యత నిస్తున్నాము. ఒకవైపు మా వ్యాపార భాగస్వాములకు అందించవలసిన సహాయ సహకారాలను కొనసాగిస్తూనే, భారత దేశంలో పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ భారత ప్రభుత్వ మార్గదర్శక త్వాలను మరియు సూచనలను అనుసరిస్తు న్నాము. మా ప్రాధమిక ప్రాధాన్యత అయిన "ప్రజలపట్ల, భవిష్యత్తుపట్ల మా నిబద్ధత"కు అనుగుణంగానే భారతదేశంలోని తోషిబా గ్రూప్ కంపెనీలు ప్రస్తుత సంక్షోభ సమయంలో సుమారు 1.95 కోట్ల రూపాయలను విరాళంగా ఇవ్వడంతోపాటు, భారత ప్రభుత్వం ఆమోదించిన ఇతర సిఎస్ఆర్ కార్యకలాపాలకు మద్దతునిస్తున్నాయి." అన్నారు. తోషిబా కు భారత దేశంతో దాదాపు 60 ఏళ్ల అనుబంధం ఉంది. 'మెక్-ఇన్?ఇండియా', 'ఎక్స్ పోర్ట్-ఫ్రమ్-ఇండియా'అనే లక్ష్యంతో తోషి బా భారత దేశాన్ని తన ఉత్పత్తి మరియు ఎగుమతుల కేంద్రంగా మార్చుకుంది. ఈ మహమ్మారి వ్యాప్తి సమయంలో భారతదేశంలోని తోషిబా గ్రూప్ కంపెనీలు భారత ప్రభుత్వ విధానాలకు కట్టుబడి ఉంటూనే, తమ వాటాదారులందరి పట్ల తమకున్న కమిట్మెంట్స్ ను గౌరవించే విషయంలో కూడా నిబద్ధత కలిగి ఉన్నాయి.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.